బాగు చేసేదెన్నడు?



రహ్మత్ నగర్ చౌరస్తాలో శిథిలమైన మ్యాన్‌హోల్ మూత

- శిథిలమైన మ్యాన్‌హోల్ మూత..
- పారుతున్న డ్రైనేజీ మురుగు

యూసుఫ్‌గూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ నుంచి రహ్మత్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి నిమ్స్ మే ప్రహరీ పక్కన మ్యాన్‌హోల్ మూత శిథిలమైంది. 15 రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. అలాగే, రహ్మత్ నగర్ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ మూత శిథిలమై ప్రమాదకర స్థితిలో ఉంది. ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడడంతో వచ్చిపోయే ద్విచక్ర వాహనదారులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



నిమ్స్ మే ప్రహరీ పక్కన పొంగుతున్న డ్రైనేజీ



సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు దసరా శుభాకాంక్షలు చెబుతున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, లక్ష్మి, శ్రీలక్ష్మి, నాగలక్ష్మి, రాజేశ్వరీ, లలిత, కూతురు నర్సింహ, పుట్టల శేఖర్

అమీర్‌పేట, ఆంధ్రజ్యోతి

'మహిళలపై దాడితో సంబంధం లేదు'

బోరబండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మశంకర్ నగర్ మహిళలపై దాడి సంఘటనతో తనకు సంబంధం లేదని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.వెంకటస్వామి తెలిపారు. రాజకీయంగా ఉన్న విభేదాలతోనే తనను బద్‌నామ్ చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ ప్రాంతంలో గత నెల 30న జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పాల్గొన్నానని తెలిపారు. ఆయనతో పాటు సభా కార్యక్రమంలో ఉన్నానని, సాయంత్రం 6:30 వరకు కార్యక్రమం కొనసాగిందని, ఈ లోపునే తాను మహిళలపై దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక బస్తీ నాయకులు తనపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, దీనిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న అజారుద్దీన్

కాంగ్రెస్ హామీని నిలబెట్టుకుంటుంది : అజారుద్దీన్

బంజారాహిల్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందని, త్వరలోనే తాను ఎమ్మెల్సీ అవుతానని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దని మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. నాలుగైదు రోజుల నుంచి ఆయన నివాసానికి పెద్ద ఎత్తున మైనార్టీ నేతలు, కార్యకర్తలు వస్తూ తన ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన వారికి నచ్చజెప్పి పంపిస్తున్నారు. బంజారాహిల్స్ నివాసంలో శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అజారుద్దీన్ పోటీ చేయాలంటూ మైనార్టీ నేతలు ఒత్తిడి తీసుకొచ్చారు.



బోరబండ సైట్-1 కమాన్ వద్ద చిల్లాలో దువా చేస్తున్న కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్



శ్రీరామ్‌నగర్ మసీదు వద్ద గౌస్ ఎ పాక్ చిల్లాలో దువా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మీ యాదవ్

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ వేడుకలు

బోరబండ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్యార్వీ వేడుకలను బోరబండలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సైట్-1 కాలనీ కమాన్ గౌస్ ఎ ఆజం మసీదు వద్ద చిల్లాలో కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ దువా చేశారు. అనంతరం వందలాది మందికి అన్న సంతర్పణ చేశారు. శ్రీరామ్ నగర్‌ని మసీదు వద్ద గౌస్ ఎ పాక్ చిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మీ యాదవ్ ముస్లిం మతపెద్దతో కలిసి దువా చేశారు. అనంతరం ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. శ్రీరామ్ నగర్ బస్తీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఉమర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



రహ్మత్ నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేదీప్యవిజయ్

కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అభివృద్ధి

వెంగళరావునగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యవిజయ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని రహ్మత్ నగర్, యాదగిరి నగర్, వీడియోగల్లీ, జవహర్ నగర్, తదితర ప్రాంతాల్లో ఆమె పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్యామ్ ముదిరాజ్, విజయ్ ముదిరాజ్, సత్యనారాయణ, ఆదిత్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కేంద్రం తగ్గించిన జీఎస్టీ గురించి దుకాణాల యజమానులకు తెలియజేస్తున్న బీజేపీ నాయకులు

పేదలపై జీఎస్టీ భారం తగ్గించిన మోదీ

ఎర్రగడ్డ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా జీఎస్టీని తగ్గించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు అన్నారు. శనివారం ఎర్రగడ్డలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి తగ్గించిన జీఎస్టీ గురించి దుకాణాల యజమానులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీని తగ్గించడం వల్ల ఎంతోమంది మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు బొట్ల విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్‌రెడ్డి, మేకల సారంగపాణి, ప్రేమ్ కుమార్, శ్రీనివాసులురెడ్డి, ఈదులకంటి రాజేష్ గణేశ్ కుమార్, నాగేశ్వరరావు, రాజయ్య, ప్రసన్న, జ్యోతి, ఎస్ఎల్ దీపక్, రీనా, బసంత్, నరసింహారావు, శివ, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్యకర్తల బలం

బంజారాహిల్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు కార్యకర్తల బలం పుష్కలంగా ఉందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం తథ్యమని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్ గోసుల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శ్రీనగర్ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్ అధ్యక్షతన యూసుఫ్‌గూడ డివిజన్ బూత్ ఇన్‌చార్జీల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి ఇన్‌చార్జీలు ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో నాయకులు సంతోష్ ముదిరాజ్, నర్సింగ్ దాస్, బస్వరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్



ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్తీక్‌రెడ్డి, తదితరులు

దివంగత ఇంద్రారెడ్డికి నివాళి

రాజేంద్రనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి 71వ జయంతిని శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు, ఆయన అభిమానుల ఆధ్వర్యంలో పీడీపీ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఆ యన చిత్రపటానికి ఇంద్రన్న తనయుడు, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ, ఇంద్రారెడ్డి ఆశయాల సాధన కోసం తాను పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్, మైలార్‌దేవుపల్లి డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్.వెంకటేశ్, కొలన్ సుభాష్‌రెడ్డి, జాలిగం చిత్తారి, ముక్రం ఖాన్, జహీరుద్దీన్, నోముల రాము యాదవ్, అక్కెం రాఘవేందర్ యాదవ్, కొత్త రాజశేఖర్‌రెడ్డి, అప్పారెడ్డి ముఖేశ్, పసుపుల రమేశ్‌చారి, పి.జీవన్‌దాస్, బద్దం శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్లకాడి సూర్యం, సరికొండ దుర్గేశ్, బండ రాజేశ్ యాదవ్, పుప్పాల లక్ష్మణ్, శ్రీవర్ధన్‌రెడ్డి, పచ్చ శ్రీనివాస్, షేక్ నయీముద్దీన్, కొంపల్లి జగదీశ్, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చెట్టిగారి చిన్న పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



వీల్‌చైర్లు అందజేస్తున్న ఉషారాణి

నిమ్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల విద్యార్థుల ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో శనివారం జరిగింది. 2025- 26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కొందరికి మెడిసిన్‌లో సీటు రాలేదని బాధపడకుండా అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ దామోదర నాయుడు పాల్గొన్నారు. నిమ్స్ ఆస్పత్రిలో ఫార్మా కాలేజ్ విభాగాధిపతిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పి.ఉషారాణి ఐదు వీల్‌చైర్లను అందజేశారు. కార్యక్రమంలో అదనపు మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చరణ్, ఆర్ఎంఓ సల్మాన్, డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్ శర్మ

ధన్వంతరి ఫౌండేషన్ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

ముషీరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ధన్వంతరి రియల్ ఎస్టేట్ ఆస్తులను అమ్మి వచ్చిన మొత్తం డబ్బును బాధితులకు సమానంగా పంపిణీ చేయాలని ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్ గిరిప్రసాద్ శర్మ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బాధితులతో కలిసి ఆయన మాట్లాడుతూ సీసీఎస్ విచారణలో ధన్వంతరి బాధితులు 4,400 మంది ఉన్నారని నిర్ధారణ అయిందన్నారు. రియల్ ఎస్టేట్ అనే రంగం అసలు ధన్వంతరి ట్రస్ట్ పరిధిలో లేదని, అయినప్పటికీ కమలాకర్ శర్మ ఆయన భార్య డాక్టర్ జయశ్రీతో కలిసి ధన్వంతరి పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగించారని ఆరోపించారు. ధన్వంతరి లోగో, ధన్వంతరి ట్రస్ట్ పేరును వాడుకునే అర్హత కమలాకర్ శర్మకు లేదని స్పష్టం చేశారు. ధన్వంతరి బాధితులకు అసలు వడ్డీతో సహా నష్టపరిహారం అందించాలని ఆయన ఆస్తులను ఈ వేలం వేయడానికి ప్రతిపాదనలు రూపొందించారని, బాధితులకు త్వరలో న్యాయం జరుగుతుందని చెప్పారు. నాంపల్లి ఎంఎస్‌జే కోర్టు బాధితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని అదేవిధంగా సీసీఎస్ డీసీపీ శ్వేతారెడ్డి, ఏసీపీ ఆదినారాయణ, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కు బాధితుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బాధితులు రోజారాణి, పరిమళ, సరళ, వీపీ విజయలక్ష్మి, ఛాయాదేవి, ఇందిరాగాయత్రి, సీతాలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రాంగ్‌సైడ్ డ్రైవింగ్... 60మందిపై కేసు



రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేసిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న 60 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు పెరుగుతుండడంతో పశ్చిమ మండలం ట్రాఫిక్ పోలీసులు సంజీవరెడ్డినగర్, బంజారాహిల్స్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్‌ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద పశ్చిమ మండలం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్ డ్రైవ్‌లో పాల్గొని కౌన్సెలింగ్ ఇచ్చారు. రాంగ్‌సైడ్‌లో వాహనాలు నడపడం వల్ల ఇతరులకు కూడా ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని డీసీపీ వారికి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇక మీదట వారానికో సారి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు చెప్పారు. నిబంధనలు పాటించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు కేసులు పెట్టి చలానా వేస్తున్నట్టు తెలిపారు. మరోసారి పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు.

'తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తా'

బౌద్ధనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా చిలకలగూడకు చెందిన బండారి మహేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన కార్యవర్గంలో మహేందర్ ముదిరాజ్‌కు చోటు దక్కింది. శనివారం నామాల గుండు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తామని, ప్రజల సమస్యలపై పోరాడతామని తెలిపారు. మహిళలు, యువతకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తామన్నారు. గ్రేటర్ పరిధిలో త్వరలో మరిన్ని కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.



ఒకే దేవుడు ఒకే దేశం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రవీణ్ కుమార్ తదితరులు

'ఒకే దేవుడు ఒకే దేశం' విశ్వవ్యాప్తమే లక్ష్యం

ముషీరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ఒకే దేవుడు ఒకే దేశం' సిద్ధాంతాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యమని శ్రీలహరి కృష్ణ స్తుతి ధ్యాన కేంద్రం హైదరాబాద్ ప్రతినిధులు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, నాగరాజు, అప్పారావు, రవి, సురేష్ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా దేశ ప్రజలకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని, ప్రస్తుతం తెలంగాణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 5న ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సాయంత్రం 5గంటలకు రచయిత దేవశీస్ అంకాడీయా రచించిన హిందీలో జ్ఞాన మకరంద్, తెలుగులో తన ప్రేమగల చేతుల నైపుణ్యం రెండు పుస్తకాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, రిటైర్డ్ ఐపీఎస్ శ్రీరాంతివారీ, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ హాజరవుతారని తెలిపారు.

బ్రాహ్మణవాడీలో విద్యుత్ అధికారుల పర్యటన



బ్రాహ్మణవాడీలో విద్యుత్ సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

బేగంపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): 'బస్తీబాట'లో భాగంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శనివారం బ్రాహ్మణవాడీ ప్రాంతాన్ని సందర్శించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ నరసింహులు, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్‌బాబు, డివిజనల్ ఇంజనీర్ భీమానాయక్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిషోర్ కుమార్‌తో పాటు బేగంపేట ఏఈ సాయికుమార్ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూన గౌరీశంకర్‌గౌడ్, హనీఫ్ ఖాన్ అధికారులకు స్థానిక విద్యుత్ సంబంధిత సమస్యలను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించి, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

అదేవిధంగా, ఎక్కడైతే బేర్ కండక్టర్లు ఉన్నాయో ఆ ప్రాంతాల్లో వాటిని ఏబీ కేబుళ్లతో మార్చాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో చెత్త వేయకుండా, పరిశుభ్రత పాటించాలని వినియోగదారులను అధికారులు కోరారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన బోయినపల్లి వేంకటేశ్వరస్వామి

బోయినపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సున్నితమైన ఆ పూలు అందమా స్వామి మనోహరమైన చిరునవ్వు అందమా అని పరిశీలిస్తే స్థాణువై అలా ఆ మోము వైపు చూస్తూ ఉండిపోవడమే తప్ప చూపు మరల్చుకోలేరు అదీ ఆ వెంకటేశుని రూపంలో ఉన్న మహిమ. దసరా పండుగను పురస్కరించుకుని బోయినపల్లి న్యూసిటీ కాలనీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని కలియుగ వేంకటేశ్వరుడిని పూలతో అందంగా అర్చకులు అలంకరించారు. దీంతో ఆయన భక్తులకు ప్రత్యేక అలంకారంతో దర్శనం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అలంకరణ అనంతరం మహా హారతి, స్వామి వారికి ప్రసాద ఆరగింపు అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన ఆలయ అర్చకులు పవన్ స్వామి, దీపక్ స్వామి, శ్రీధర్ స్వాములను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.



డ్రైనేజీ పనులను ప్రారంభించిన అధికారులు

డ్రైనేజీ సమస్యపై స్పందించిన అధికారులు

అడ్డగుట్ట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట డివిజన్‌లోని ఆర్‌ఆర్ మైదానం సమీపంలోని అడ్డగుట్ట బి సెక్షన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయి మురుగు ఇళ్లలోకి పారుతుందని బీజేపీ సీనియర్ నాయకుడు రాజుతో పాటు బస్తీవాసులు రెండు రోజుల క్రితం మారేడుపల్లి డిప్యూటీ జనరల్ మేనేజర్ విద్యాసాగర్, ఏఈ స్రవంతిలకు ఫిర్యాదు చేయడంతో స్పందించి పగిలిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్‌లను తొలగించి కొత్త పైప్‌లైన్ కోసం నిర్మాణ పనులు చేయడంతో జలమండలి అధికారులకు స్థానికులు అభినందనలు తెలిపారు. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను తీర్చిన అధికారులకు ధన్యావాదాలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

అడ్డగుట్ట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్‌లో ఓ ఇంటిలో జరిగిన అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ తనయుడు తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ కుమార్ శనివారం బాధిత కుటుంబానికి రూ. 50 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దొమ్మాటి శివకుమార్, అనంత కృష్ణ, ప్రభాకర్, సురేష్, నవీన్, హరి, ఉదయ్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తా : మహేందర్



కల్వకుంట్ల కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రేటర్ అధ్యక్షుడు బండారి మహేందర్ ముదిరాజ్

బౌద్ధనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా చిలకలగూడకు చెందిన బండారి మహేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన కార్యవర్గంలో మహేందర్ ముదిరాజ్‌కు చోటు దక్కింది. శనివారం నామాలగుండు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తామని, ప్రజల సమస్యలపై పోరాడతామని తెలిపారు. తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ పేద ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉంటుందన్నారు. మహిళలు, యువతకు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చి వారిని తెలంగాణ జాగృతిలో సభ్యత్వం కల్పిస్తామన్నారు. గ్రేటర్ పరిధిలో త్వరలో మరిన్ని కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. తనపై నమ్మకంతో గ్రేటర్ అధ్యక్షుడిగా పగ్గాలు అప్పగించిన కవితక్కకు ధన్యావాదాలు తెలుపుతున్నానన్నారు.



ఉప్పరిగూడ సంజయ్‌గాంధీనగర్‌లో కమ్యూనిటీ హాల్ భూమిపూజలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రేంకుమార్

కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు భూమిపూజ

మల్కాజిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఉప్పరిగూడ సంజయ్‌గాంధీనగర్‌లో ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ హాల్‌కు శనివారం కార్పొరేటర్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. సుమారు రూ.20 లక్షలతో ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ హాల్ స్థానికులకు ఎంతో ఉపయోగపడనుందని అన్నారు. చిన్నచిన్న శుభకార్యాలు, వివాహాలు లాంటివి నిర్వహించుకునేందుకు ప్రజలు ఈ హాల్‌ను ఉపయోగించేలా నిర్మాణం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ భాస్కర్ రావు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు ఉమేష్‌సింగ్, కిషోర్, మాజీద్, అరుణ్, కాలనీవాసులు బాలయ్య, రషీద్, రాములు తదితరులు పాల్గొన్నారు.



దుర్గామాత నిమజ్జనోత్సవ ఊరేగింపు



బీదలబస్తీలో దుర్గామాత మండపాన్ని సందర్శించి పూజలు చేసిన మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తదితరులు



పార్శీగుట్ట నుంచి నిమజ్జనానికి తరలివెళుతున్న అమ్మవారు

వైభవంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

సికింద్రాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): న్యూబోయినపల్లి బాపూజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గామాత నవరాత్రుల పూజలందుకుని, శుక్రవారం రాత్రి నిమజ్జనానికి తరలివెళ్లింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై నిమజ్జనోత్సవ ఊరేగింపును ప్రారంభించారు. దుర్గయ్య, అజిత్‌కల్యాణ్, పవన్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, రామారావు, బీజేపీ శంకర్, రాకేష్‌సింగ్, నర్సింగ్‌రావుగౌడ్, కల్యాణ్‌సందీప్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి దుర్గామాత నిమజ్జనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

నిమజ్జనానికి తరలిన దుర్గామాత విగ్రహాలు

బౌద్ధనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన మండపాల నుంచి శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం దుర్గామాత విగ్రహాలు తరలివెళ్లాయి. బీదలబస్తీలో ఏర్పాటుచేసిన మండపంలో మంత్రి లక్ష్మణ్‌కుమార్, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లు పూజలు చేశారు.

వారాసిగూడ, బౌద్ధనగర్, పార్శీగుట్ట, సీతాఫల్‌మండి, చిలకలగూడ, శ్రీనివాస్‌నగర్, బ్రాహ్మణబస్తీ తదితర ప్రాంతాల నుంచి దుర్గామాత విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు.

దుర్గామాత దయతో అందరూ బాగుండాలి : కవిత

బోయినపల్లి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): దుర్గామాత దయతో ప్రజలందరూ బాగుండాలి అని కోరుకుంటున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బోయినపల్లి పోలీస్ స్టేషన్ వద్ద టింకూ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా శనివారం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు టింకూ గౌడ్ కవితను ఘనంగా సత్కరించారు. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ.. బోయినపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో రాగీరు టింకూ గౌడ్ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా దుర్గామాతను ప్రతిష్టించి పూజలు చేస్తుండడం అభినందనీయమని అన్నారు. నవరాత్రుల్లో అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ, భక్తులకు ప్రతిరోజు ప్రసాదాలు అందిస్తున్న ఆయనకు, కుటుంబ సభ్యులకు, స్థానిక జాగృతి నాయకులకు, కార్యకర్తలకు అమ్మవారి కటాక్షం కలగాలని పూజలు చేసినట్లు తెలిపారు. ఆమె వెంట పలువురు జాగృతి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

నిరాడంబరంగా పుట్టినరోజు వేడుకలు: తలసాని

సికింద్రాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6న తన పుట్టిన రోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకోవాలని సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్ణయించుకున్నారు. వెస్ట్‌మారేడుపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో విజయదశమి శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన సనత్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో శనివారం సమావేశమై ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా 6న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రుల సమక్షంలో కేక్ కట్ చేస్తానని తెలిపారు. తన వియ్యంకుడు ఇటీవలే గతించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకుని, ఈ పరిస్థితుల్లో ఎలాంటి ఆర్భాటాలు లేకుండా పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించుకున్నట్టు తలసాని వెల్లడించారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్‌లు నామన శేషుకుమారి, అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, నాయకులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్, కోషికె కిశోర్‌కుమార్, మహేష్‌యాదవ్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

● ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నదని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మసూద్ ఆధ్వర్యం లో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి భోలక్‌పూర్ సమస్యలను తెలియజేసి వాటిని పరిష్కరించాలని కోరుతూ సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంపీ నిధుల నుంచి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

మల్కాజిగిరి, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం మల్కాజిగిరిలోని గాంధీ పార్కులో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదిగొండ సుధాకర్, తెలంగాణ ప్రాంత ఆర్ఎస్ఎస్ సహకార్యబాహి ఉప్పసంచ మల్లికార్జున్, హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సంఘ్ పరివార్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్కాజిగిరి నగర సంచాలక్ జూలూరి శ్రీనివాస్ కోరారు.

గురుస్వామికి 'మహాశాస్తా' పురస్కారం

కుషాయిగూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలకు పైగా అయ్యప్ప మాల ధారణతో చర్లపల్లి రామాలయం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేస్తున్న రుద్రగోని వెంకటేశ్ గౌడ్‌కు 'మహాశాస్తా' పురస్కారం లభించింది. శనివారం మహాశాస్తా సేవా ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సుదగాని రాజు ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు.

మద్యం అక్రమ విక్రయదారులపై కేసు

కుషాయిగూడ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకొని వైన్స్/బార్‌లు అధికారికంగా మూసివేసిన నేపథ్యంలో అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్న నలుగురిపై చర్లపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.85,401/-లు విలువ చేసే దాదాపు 77.03 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బంది దాడులు చేసి సదరు విక్రయదారులను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వివరించారు.

సదర్ ఉత్సవాలకు రూ.10కోట్లు మంజూరు చేయాలి

ముషీరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : యాదవ కులస్థులు భక్తిశ్రద్ధలతో రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్‌లో నిర్వహించే సదరు ఉత్సవాలకు ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేయాలని తెలంగాణ సదరు ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల హరిబాబుయాదవ్ కోరారు. శనివారం బీఆర్ఎస్ ముషీరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సదరు ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎడ్ల హరిబాబు యాదవ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సదరు ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు బాలరాజుగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నాయకులు శ్రీధర్, నవీన్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్ష కార్యదర్శులు సదా, సంతోష్ పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పఠనం

మచ్చబొల్లారం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త భోగ విష్ణు మూర్తి ఆధ్వర్యంలో శనివారం పలు దేవాలయాలలో సామూహిక హను మాన్ చాలీసా పఠనం నిర్వహించారు. శ్రీ గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం అల్వాల్ హిల్స్, స్వయంభు భక్త అంజనేయన స్వామి ఆలయం సిటిజెన్ కాలనీ, సంజీవిని హనుమాన్ ఆలయం మచ్చ బొల్లారంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషన్, రమేష్, చందన రెడ్డి, అంజలి తదితరులు పాల్గొన్నారు.



మర్యాదపూర్వక కలయిక

రాష్ట్రమంత్రి డి.శ్రీధర్‌బాబును బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.ఆనంద్‌బాబుగౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రంలో మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు తదితరులు

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ తదితరులు

ఘనంగా సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

తార్నాక, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమాజ్‌వాదీ పార్టీ 33వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ ఆధ్వర్యంలో శనివారం తార్నాకలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన రాష్ట్ర అధ్యక్షుడు పార్టీ పటిష్ఠతకు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రొ.సింహాద్రి మాట్లాడుతూ సమసమాజ స్థాపన, సామాజిక పరివర్తన లక్ష్యాలతో సమాజ్‌వాది పార్టీ ముందుకు వెళుతున్నదని అన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా భవిష్యత్తులో ముందుకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ నాయకులు శ్రీహరి ముదిరాజ్, రిజ్వాన్ హుస్సేన్, మజీద్ సిద్దిఖీ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



జైపూర్‌కు వెళుతున్న తపస్ బృందం

జైపూర్‌కు తపస్ బృందం

అడ్డగుట్ట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో కేంద్ర సంస్థ అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ ఆధ్వర్యంలో 5, 6, 7 తేదీల్లో జరుగనున్న 9వ జాతీయ మహాసభలో పాల్గొనడానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) వివిధ జిల్లాల నుంచి 13 మందితో కూడిన బృందం శనివారం సాయంత్రం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వెళుతున్నట్టు తపస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి బి. తిరుపతి రెడ్డి, జి.వీరేష్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు, దేశాన్ని సమున్నత స్థానంలో నిలపడానికి, ఉపాధ్యాయులు నిర్వర్తించాల్సిన కృషి తదితర అంశాలను వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతినిధులతో చర్చిస్తామని చెప్పారు. ప్రతిపాదనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామన్నారు. జైపూర్‌కు వెళ్లిన వారిలో వీరేష్ లక్ష్మీనారాయణ, వీర కుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి, రజనీదేవి, మంజుల, అనురాధ, సిహెచ్ జ్యోతి, సునీతరాణి, కరుశ్రీ, ఇందిరా, ఏ. జ్యోతి, సురేఖబాయిలు ఉన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కే.వీ.రమణాచారి తదితరులు

రాంనగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర 2025 నవంబర్ 6, 7వ తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కే.వీ.రమణాచారి తెలిపారు. జాతర పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం తెలంగాణ బాలోత్సవం 5వ పిల్లల జాతర కార్యక్రమ నిర్వాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పిల్లల జాతరలో 24 ఈవెంట్లుగా 24 వేదికలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయని తెలిపారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్‌గా విభజించి వారి ఆసక్తికి తగిన అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల ప్రతిభా నైపుణ్యతలను వెలికితీయడానికి, విద్యార్థుల భవిష్యత్తుపై ఆసక్తిని రేకెత్తించడానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా బాలోత్సవం పిల్లల జాతర కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కే.వీ.రమణాచారి, చీఫ్ ప్యాట్రన్స్ జస్టిస్ జి.రాధారాణి, అశోక్‌తేజ, ఏనుగు నరసింహారెడ్డి, ఎం.డి.రియాజ్‌లతో పాటు 90 మందితో కమిటీలు ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి సోమయ్య, అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సుజావతి, మహేష్ దుర్గే, జె.వెంకన్న పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవనంలో దొంగతనం

● తాళం పగులగొట్టి సీసీ కెమెరా యూనిట్ చోరీ

ఉప్పల్, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల యూనిట్‌ను దొంగిలించిన ఓ దొంగ పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కి కళ్లుగప్పి పారిపోయిన సంఘటన శుక్రవారం రాత్రి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉప్పల్ మేయిర్ రోడ్డులోని ప్రెస్ క్లబ్ భవనం తాళం పగులగొట్టి లోనికు ప్రవేశించి బీరువాలన్నింటిని చెక్ చేశాడు. అక్కడున్న సెల్ఫ్‌లను వెతికి వస్తువులన్నింటిని చిందరమందరగా పడేశారు. ఎలాంటి విలువైన వస్తువులు దొరకకపోవడంతో గోడకు బిగించిన సీసీ కెమెరాల యూనిట్ (డీవీఆర్)ను, సీసీ కెమెరాల మానిటర్‌ను దొంగిలించాడు. మొదట డీవీఆర్ మిషన్‌ను తీసుకెళ్లిన దొంగ తర్వాత సీసీ కెమెరాల మానిటర్‌ను దర్జాగా చేతిలో పట్టుకొని భవనం బయటకు వస్తుండగా పనిపై అటుగా వచ్చిన రిపోర్టర్ దాస రాజు దొంగను గమనించి దగ్గరకు వచ్చి ప్రెస్ క్లబ్ తాళం ఎలా పగుల గొట్టావు, టీవీ ఎక్కడకు తీసుకెళుతున్నావు అంటూ ప్రశ్నించాడు. దీంతో ఆ వ్యక్తి ఉప్పల్ పోలీసులే సీసీ కెమెరా విజువల్స్ చూసేందుకు తీసుకు రమ్మన్నారని చెప్పాడు. పైగా ఇప్పటి వరకు పోలీసులు ప్రెస్‌క్లబ్ భవనానికి వచ్చి పరిశీలించి వెళ్లారు. తాను అక్కడకే వెళుతున్నాను అంటూ నమ్మబలికాడు. టీవీ చేతిలో పట్టుకొని వేగంగా నడుచుకుంటూ వెళుతుండగా అనుమాతనంతో రాజు ఆ నిందితున్ని అనుసరించాడు. ఇద్దరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితుడు చేతిలో ఉన్న టీవీని పోలీస్‌స్టేషన్ రిసెప్షన్ వద్ద టేబుల్‌పై పెట్టాడు. నిన్ను సీసీ కెమెరాల యూనిట్‌ను తీసుకొని రమ్మన్న పోలీసులు ఎవరు చెప్పమని ఆ నిందితున్ని ప్రశ్నించడంతో ఓ ఎస్సై పేరు చెప్పడంతో రాజు సదరు పోలీసు అధికారికి ఫోన్ చేస్తుండగా సదరు వ్యక్తి అక్కడి నుంచి పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న ప్రహరీ దూకి పారిపోయాడు. నిందితుడు అక్కడ లేకపోవడంతో ప్రెస్‌క్లబ్‌కు వచ్చింది దొంగే అన్న విషయం స్పష్టమైంది. దొంగ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది, గోడ దూకి పరారైన దృశ్యాలు పోలీస్‌స్టేషన్ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో పరిసరాల్లో ఎక్కడా గాలించినా దొంగ కనరాకపోవడంతో జరిగిన దొంగతనంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ దొంగతనం చేసింది పాత నేరస్తుడే అయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.



పోలీస్‌స్టేషన్ సీసీ కెమెరాలో రికార్డు అయిన నిందితుడి ఫొటో

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా

మచ్చబొల్లారం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన అండగా నిలబడతామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి అనారోగ్యంతో 10 రోజులుగా ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని ఇటీవలే ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం రాజిరెడ్డిని పరామర్శించి అనారోగ్యం విషయం అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తనను పరామర్శించి భరోసా కల్పించి ఎంతో మనోధైర్యాన్ని కల్గించారని రాజిరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, నాయకులు మాచర్ల శ్రీనివాస్, మల్లికార్జున్ గౌడ్, శ్రీనివాస్ వర్మ, గోపి, కందుకూరి కరుణశ్రీ, మోయి సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.